క్లుప్తంగా

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం



ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరులో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. ఉత్సవాలకు హాజరై అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరినట్లు తెలిపారు.

ఘనంగా గాయత్రి ఆరాధన



ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విశ్వకర్మ గాయత్రి ఆలయంలో గురువారం ఘనంగా ఆరాధన మహోత్సవం నిర్వహించారు. పట్టణంలో విశ్వకర్మలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చకులు ప్రేమానందం, శంకరాచారి, చందన, కవిత, భార్గవి ఆధ్వర్యంలో విశ్వకర్మ వ్రతం, పతాక ఆవిష్కరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యత సంఘం నాయకులు సాయన్నగారి శ్రీనివాస్, తుమ్మనపల్లి శ్రీనివాస్, సుందర్, రాణి, నాగభూషణం, వేణు, శ్రీనివాస్, భాస్కర్, నరసింహాచారి, రమేశ్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో అధ్యాపకులు, విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు బతుకమ్మ అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం అన్నారు. కళాశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు, ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కమలా క్రిస్టియాన, ఉమారాణి, లక్ష్మి, శ్రీలత, సౌజన్య, అర్చన, శోభారాణి, సరోజ, జ్యోతి, స్వర్ణ, అనురాధ, శృతి, సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువుకట్టపై జరుగుతున్న సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ రామ్మూర్తి ఆదేశించారు. బతుకమ్మ పండుగకు కోసం చేయవల్సిన ఏర్పాట్లు, చెరువు సుందరీకరణకు జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ బతుకమ్మ ఆడే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ సదానందం, మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: దాతలు అందించే సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. హైదరాబాద్‌కు చెందిన మోడీ బిల్డర్స్ నిర్వాహకులు గురువారం 100 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెరగటంతో వారిని సంప్రదించామన్నారు. ఆ సంస్థ మేనేజర్ రజని 100 డ్యుయల్ డెస్క్ బెంచీలను అందజేశారని చెప్పారు. సహకరించిన ఆమెకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

వాగు ఉధృతం.. దాటాలంటే కష్టం



ఉధృతంగా ప్రవహిస్తున్న బతుకమ్మ వాగు

బతుకమ్మవాగుపై బ్రిడ్జిలేక వెతలు
- ఏటా వేధిస్తున్న సమస్య
- శాశ్వత పరిష్కారం చూపాలని రైతుల విన్నపం
- మంత్రి పొన్నంపైనే ఆశలు

అక్కన్నపేట(హుస్నాబాద్): తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో ఆ వాగు దాటుడు గగనమే. వరద ఉధృతి కారణంగా రైతన్నల రాకపోకలు స్తంభిస్తున్నాయి. మండలంలోని చౌటపల్లి శివారులోని బతుకమ్మవాగు దాటి వైకుంఠధామం, అలాగే పంట పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. వానలు కురిసి వాగు ఉధృతి పెరిగినప్పుడు అన్నదాతలు అరిగోస పడాల్సిన దుస్థితి నెలకొంది.

బ్రిడ్జిలేక అవస్థలు

సుమారు 500 మంది రైతులు ఈ వాగు దాటి తమ పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తారు. అలాగే గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారం చేయాలన్నా వాగు దాటవలసిందే. రెండు, మూడు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు అటుగా వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. ప్రతియేటా భారీ వర్షాలు పడితే వాగు దాటే సాహసం చేయలేక పంట పొలాలకు వెళ్లలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులు, నాయకులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకున్న నాథుడు కరువయ్యాడని రైతులు వాపోతున్నారు.

పొన్నం స్పందించినా..

అంతిమ సంస్కారాలకు కూడా ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల చౌటపల్లి–మల్లంపల్లి గ్రామాల శివారులో బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపనకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించినట్లు రైతులు తెలిపారు. అయితే ఆయన సానుకూలంగా స్పందించారని, కాని ఫలితం కానరాలేదని వాపోయారు.

ప్రతిపాదనలు పంపించారు..



మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు వాగును సందర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి కావాల్సిన నిధుల అంచనా, కొలతలు తదితర వివరాలను ఉన్నతాధికారులను సమర్పించారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు సైతం మంజూరు చేస్తామని మంత్రి పొన్నం చెప్పారు. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది.

– పులికాశి రమేశ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు, చౌటపల్లి

స్వచ్ఛ పట్టణమే లక్ష్యం కావాలి



అక్కన్నపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు



సిద్దిపేటజోన్: పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రం చేస్తున్న ఆశ్రిత్

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్)/గజ్వేల్‌రూరల్/జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వచ్ఛ పట్టణంగా మార్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలో పర్యటించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయా వార్డుల్లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ అన్నింటినీ వార్డు ప్రత్యేక అధికారులు శుభ్రం చేశారు. అనంతరం పట్టణంలోని చెరువుల వద్ద బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలించారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛతోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఇంటి చుట్టుపక్కల వారికి స్వచ్ఛత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. అర్బన్ ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎంపీడీఓ భానోతు జయరాం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు, ఐకేపీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, ఐకేపీ సీసీలు తిరుపతి, శివచరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో ఎంపీడీఓ రాంరెడ్డి పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒకరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని రోడ్లపైన, మురుగు కాల్వల్లో వేయవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొహినొద్దిన్, కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాకటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కష్టసుఖాలలో అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలంలో ఎల్కల్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు జాలరాజు కుమారుడు జాల హర్షిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అనాజీపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎనుముల నర్సింహారెడ్డి తల్లి లక్ష్మి, తిమ్మక్ పల్లి యువనాయకుడు ఎంకొల్ల రాజు తల్లి లక్ష్మి, యువ కార్యకర్త ఉడిది శేఖర్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. అధైర్య పడవద్దని ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ యాదగిరి, నాయకులు శ్రీనివాస్ గుప్తా, రణం శ్రీనివాస్‌గౌడ్, మున్నా, రాజిరెడ్డి, దయాకర్ తదితరులున్నారు.

ఉపాధ్యాయుల కొరతను తీర్చండి

దుబ్బాకటౌన్: పదోన్నతుల కారణంగా ప్రాథమిక పాఠశాల్లో ఏర్పడిన ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాయపోల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులు కలిసి హెచ్‌ఎం బాధ్యతలు నిర్వర్తిస్తూ 18 సబ్జెక్ట్‌లు బోధిస్తే నాణ్యమైన విద్యా ఎలా అందుతుందన్నారు. నాయకులు నరసింహ, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని జాతీయ ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా దట్టమైన పొగలతో పాటు మంటలు చెలరేగాయి. సబ్ స్టేషన్ పై భాగంలో ఉన్న పొటెన్సియల్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీ)లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన లైన్‌మేన్ శంకర్, సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉపయోగించి మంటలను ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

సంఘటితంగా పోరాడుదాం

సిద్దిపేటజోన్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుదామని ఉమ్మడి మెదక్ జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కో–ఆర్డినేటర్ శంకర్ పిలుపునిచ్చారు. బీజేఆర్ భవన్‌లో గురువారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా కనకరాజును నియమించారు. సమితి ప్రతినిధులు అశోక్, రాజిరెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర జ్ఞానంతోనే సామాజిక మార్పు

తొగుట సీఐ షేక్ లతీఫ్



దుబ్బాకటౌన్: విద్యార్థినికి సామగ్రిని అందజేస్తున్న సీఐ లతీఫ్, ఎస్‌ఐ మానస, ఎంఈఓ తదితరులు

దుబ్బాకటౌన్: అక్షర జ్ఞానంతోనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని, అలాంటి విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తొగుట సీఐ షేక్ లతీఫ్, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గంగి యాదగిరి గురువారం విద్యార్థులకు యూనిఫారాలు, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నా, గౌరవం, గుర్తింపు పొందాలన్నా చదువుతోనే సాధ్యం అన్నారు. ఎస్‌ఐ మానస, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, నవీన్ కుమార్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు నాగరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు

హుస్నాబాద్: డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లొవద్దని ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఈవ్ టీజింగ్, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ గంగాధర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

డీఐఈఓ రవీందర్



మాట్లాడుతూన్న డీఐఈఓ రవీందర్

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు చెడు వ్యవసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకొవచ్చని డీఐఈఓ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల్లో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దుతుందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎంఈఓ వరదరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

దౌల్తాబాద్(దుబ్బాక): చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీయస్ సూపర్‌వైజర్ గిరిజ చెప్పారు. మండల పరిధిలోని ముబారస్పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శి పాల్గొన్నారు.

◆ మూడు నెలలుగా అందని వేతనాలు

కొండపాక(గజ్వేల్): పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా అందని వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఆయన మాట్లాడారు. ప్రభాకర్, కొమురయ్య, నర్సింహులు, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

చిన్నకోడూరు(సిద్దిపేట): పంట రుణాల విషయంలో బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ యూనియన్ బ్యాంకు ఎదుట రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. అసలు, వడ్డీ కట్టకపోతే పంట రుణాలు రెన్యువల్ చేయడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని బ్యాంక్ మేనేజర్ హామీ ఇచ్చారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మిరుదొడ్డి(దుబ్బాక): సీజనల్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా సూచించారు. పీహెచ్‌సీలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన లేకపోతే వ్యాధుల భారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లింగమూర్తి, సిబ్బంది అనురాధ, నఫీసా, స్వప్న, రవీందర్, భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు బ్యాగుల అందజేత

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హన్మకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాగులు అందించారు. పాఠశాలలో గురువారం అతిథులు బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని మాజీ సర్పంచ్ వంగ విజయలక్ష్మి కోరారు.

విధుల నిర్వహణలో అప్రమత్తం

కలెక్టర్ హైమావతి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

బెజ్జంకి(సిద్దిపేట): విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హైమావతి సూచించారు. మండలంలోని తోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఓపీ, అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. సరిపడా మందులు అందుబాటులో ఉండాలని మెడికల్ అధికారి కృష్ణతేజకు సూచించారు. సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తోటపల్లి, వీరాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని పరిశీలించారు. నిర్మాణాల వివరాలను దశల వారీగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీఓ మంజులను ఆదేశించారు. వీరాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదార్లు గండ్ల మల్లవ్వ, లక్ష్మయ్యల ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణనే ధ్యేయం

సీడీపీఓ ఎల్లయ్య



మిరుదొడ్డి(దుబ్బాక): మాట్లాడుతున్న సీడీపీఓ ఎల్లయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అంగన్‌వాడీ కేంద్రాల పోషకాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన తెలంగాణ దిశగా అడుగులు వేయాలని సీడీపీఓ ఎల్లయ్య కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 207 అంగన్‌వాడీ కేంద్రాలల్లో పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 16 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యకరమైన అలవాట్లతో పాటు, పోషకాహారం ప్రాధాన్యం, మాతా శిశు ఆరోగ్యం, రక్తహీనత నిర్మూలన వంటి అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజాగౌడ్, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యాంసన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెచ్‌ఎం జయప్రద, ఉపాధ్యాయులు వెంకటేశం, చంద్రం, భాస్కర్, శంకర్, ఆశా కార్యకర్తలు లత, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం సరైన పోషణ–ఆరోగ్య తెలంగాణ నినాదంతో గర్భిణులు, బాలింతలు, తల్లుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

దుబ్బాకటౌన్: మహిళలు పౌష్టికాహారం తీసుకొంటేనే ఆరోగ్యంగా ఉంటారని రాయపోల్ వైద్యాధికారి డా.మహారాజ్ అన్నారు. రాయపోల్ పీహెచ్‌సీలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రోగ్రాం అధికారి డా.ఆనంద్, గజ్వేల్ డివిజన్ అధికారి డా.శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రవీణ్, రవితేజ, వినీల, ఫాతిమ, శ్రావణి, రచిత, శివకుమార్, స్టెల్లీ, సారా ఫిరదోస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో ..

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ అముతుల్ పాల్గొన్నారు. ఆరోగ్యమరమైన అలవాట్లు, పోషకాహారం ప్రాధాన్యం, శిశు మాతృ ఆరోగ్యం, రక్తహీనత నిర్మూలన, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ రైతులతో వ్యవసాయాధికారి మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/ములుగు(గజ్వేల్): దీర్ఘకాలికంగా అధిక దిగుబడులను ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు సూచించారు. ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మిరుదొడ్డిలో గురువారం 9.5 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మల్లేశం రైతులకు అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 13 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రైతులు వెయ్యి టన్నుల ఆయిల్‌పామ్ గెలల దిగుబడులను సాధించి మంచి ఆదాయం పొందారని చెప్పారు. అక్టోబరులో జిల్లాలోని నంగునూరు మండలంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు అఖిల్, రేఖ, ఫీల్డ్ అధికారి ఆంజనేయులు, రైతులు భూంరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామంలో రైతు హన్మంతరెడ్డికి చెందిన ఆరెకరాల్లో ఏఓ వసంతరావు ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 570 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారన్నారు. ప్రభుత్వం నాలుగేళ్ల వరకు రాయితీ అవకాశం ఇస్తుందని, ఎకరానికి రూ.4,200 రైతు ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. అలాగే అంతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కిరణ్, భానుప్రకాశ్, కృష్ణమూర్తి, సాయిప్రసన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ములుగు మండలం అల్లీనగర్ గ్రామంలో రైతులు కృపాల్‌రెడ్డి, పాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాలలో చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో మండల వ్యవసాయ అధికారి ప్రగతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలో నాలుగు సంవత్సరాలుగా 223 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, ఏఈఓ పృథ్వి, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

కొమురవెల్లి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసవర్మ సూచించారు. గృహనిర్మాణ శాఖ డీఈ ఎ.శంకర్‌తో కలసి మండలంలోని మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, కొమురవెల్లి గ్రామాలలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఏఈ మేఘన, పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఐక్యతను దెబ్బతీయొద్దు’

సిద్దిపేటరూరల్: ఐక్యమత్యంగా ఉన్న తమను దెబ్బతీసేందుకు కొంతమంది రాజకీయ నాయకులు ప్రయత్నించడం తగదని వెంకటాపూర్ మల్లికార్జున కురుమ సంఘం నాయకులు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో 60 మంది కురుమ కులస్తులు కుల సంఘం కార్యాలయం వద్ద గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులదైవమైన బీరమ్మ ఆలయ నిర్మాణం కోసం రెండెకరాల భూమిని కొనుగోలు చేసి ఆలయం నిర్మించి అంగరంగ వైభవంగా వార్షికోత్సవం కూడా నిర్వహించామన్నారు. అయితే ఆ ఆలయ భూమిని తమ సంఘానికి చెందిన కోటగిరి ఆంజనేయులుకు లీజుకు ఇవ్వగా, యేడాదిగా ఎలాంటి లీజు చెల్లించలేదని, అడిగితే కులసంఘం సైతం తనదే అంటూ నోటీసులు పంపించాడని వాపోయారు. స్వార్థ రాజకీయాల కోసం తమ కులాన్ని విడగొడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు ప్రభాకర్, కోటగిరి ప్రభాకర్, సత్తయ్య, కనకయ్య, చిన్న కనకయ్య, స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.